IJMRT: Volume (1), Issue 1, March 2019

ISSN (Print) : 2663-2381
ISSN(Online) : 2663-4007

**International Journal of Multidisciplinary Research Transactions**

(*A Peer Reviewed Journal*)

www.ijmrt.in

# ఆరు రుచుల ఆమని

## డా. మొరంగపల్లి పద్మకుమారి*

*అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల, బేగంపేట, హైదరాబాద్.*

*Corresponding author

---

ప్రస్తుత కావ్యము "ఆరు రుచులు ఆమని". ఇది షడ్రుచుల సమ్మేళన గ్రంథము అయితే ఆ షడ్రుచులు కవి జిహ్వాను భవముతో చెప్పినవి మాత్రము కాదు. చిత్తానుభవముతో వివరించినవి.

ప్రకృతి పరిశీలనమనునది కవి పండితులకు నేటితో వచ్చినదేమి కాదు. అనాదిగా ఆదికవి నుండి వారసత్వముగా వస్తున్నది. ఆధునిక కవి గాని, ప్రాచీన కవిగాని ఎవరైనా సమయానుకూలముగ స్పందించి సందర్భాను సారముగ వర్ణించుచునేవున్నారు. ఋతు వర్ణనము ప్రతి కావ్యము నందును కన్పించు అతి సామాన్యమైన విషయము, తప్పనిసరియైన వర్ణనము. కవిని బట్టి, కాలమును బట్టి మారుచున్నది. సారంగు తమ్మయ్య "వైజయంతీ విలాసము"లో వసంత ఋతువును వర్ణించిన తీరు చూస్తే.....

**"వసంతమున వన్యాభిరామంబులు వర్ధిత యామంబులు**
**వాచాల శుక పిక స్తోమంబులు వలమాన భృంగంబులు**
**వాహ్యాళి విహారదనంగంబులు వర్థిష్ణు మలయ పవమానంబులు**
**వర్జిత జాత ప్రసూనంబులు వాసిత శీతలాంభంబులు**
**వల్లతరాగ దూసరంబులు నైనవి వాసరములు"**

ఈ పద్యమును బట్టి కవి భావమును యథాతథముగా అర్థము చేసుకునే ప్రతిభ సామాన్యులకు తక్కువ. దాని వల్ల కావ్యప్రయోజనము పూర్తిగాదు. దీర్ఘ సమాన పదఘట్టములను, వ్యవహార దూరములైన పదబంధములను విరివిగా ఉపయోగించి పద్యములను రచించినపుడు పండితులకు తప్ప అన్యులకు అవగాహనా దూరములవుతున్నాయి.

డా॥ నటేశ్వర శర్మ గారు "ఆరు రుచుల ఆమని"లో అలతి అలతి పదములతో అత్యంత మనోహరమైన భావమును వ్యక్తము చేసిన భావుకులు. కాలం మారిన కొద్దీ మానవునలలో శ్రాంతి పెరిగి విశ్రాంతికి ప్రాముఖ్యత హెచ్చింది. కాబట్టి ప్రతిదీ సులభమైన రీతిలో వుండాలి. ఇదంతా

కాలమహిమనేగాని వీరేదిగాదు. కాబట్టి దీర్ఘసమాసాలతో, సంధి పదాలతో కవిత్వం చెప్తే వినే వారు పారిపోయే స్థితికి మారిపోయారు. ఈ సంగతి కనిపెట్టిన డాక్టర్ గారు చిన్నచిన్న పదాలతో అనల్పమైన భావార్థములను పొదివినారు.

ప్రకృతికి మానవునతో పెనవేసుకున్నా బంధమును పరిశీలించినచో ప్రకృతికి మానవునకీ భేదము కల్గించదు. మానవుడు తన చుట్టూ ఆవరించివున్న ప్రకృతిని అనునిత్యము ప్రత్యేకముగా కాకున్నను సాధారణముగనే పరికించుచున్నాడు. ప్రకృతికనుగుణముగా మార్పు చెందుచున్నాడు. ప్రకృతిలో కలిగే మార్పు ప్రాణి ప్రపంచమును ఎంతో ప్రభావితము చేయుచున్నది. తొలకరి జల్లలకు పుడమితల్లి అప్పటివరకు పడిన అలసటను మర్చిపోయి పులకరిస్తుంది చలికాలాన్ని మంచుబిందువులతో అహ్వానించి పచ్చదనపు పేరంటమిచ్చి, బంతి చేమంతుల వాయనమిచ్చి సాగనంపుతుంది. ఇక తేజముట్టి పడునట్లు మార్తాండుడు వచ్చి మడుగులలోని నీటిని మాడ్చి, మనుషులకు నీటి కరువు తెచ్చిపెట్టి, నానా భీభత్సం సృష్టించి, ప్రాణులనన్నింటిని భయభ్రాంతులను చేస్తాడు. ప్రకృతిలోని మార్పులకనుగుణంగా పరిణామము చెందుటమే జీవశాస్త్ర సూత్రము.

ప్రకృతి పరంగా ఏర్పర్చుకొన్నవే పండుగ పబ్బాలు, ఆచారవ్యవహారాలు శిశిరంలో పండుటాకులు రాలిపోయి చెట్లన్ని బోసిపోయి వుంటాయి. వసంతంతో క్రొంగొత్త లేచివురులు మోసులెత్తుతాయి. ఈ విషయాన్ని కవి ఈ విధంగా చెప్తున్నారు. సుప్తావస్థలోనున్న జగత్తు వసంతలక్ష్మి రాకలతో నిత్యనూత్న చైతన్యముతో ప్రకృతి పరవశించి పోతుంది. నవీన శోభతో అలరారుతుంది. అదే మోడువారిన నిరాశాజీవుల ఆశలు చిగురించి వారి జీవితాశయాలు ఫలించి వెలుగురేఖ వారి జీవితంలో వసంత లక్ష్మిగా ప్రవేశించాలని కోరుకున్నా లోకహితైషిగా ఈ క్రింది పంక్తులలో గోచరిస్తారు కవిగారు.

**“వాడిపోవు జీవితాల**
**భవితవ్యం కనిపించగ**
**విభేదాలు మరచిపోవు**
**ప్రబోధాలు వినిపించగ”**

గడచిపోయిన కాలం భూతంలా భయపెడుతుంటే, వర్తమానం విస్రృహతో అవులిస్తుంటే, భవిష్యత్తును చైతన్యంతో పోల్చి తేజస్సును తీసుకు రావాలనే ప్రయత్నం కవిలో ప్రస్ఫుటమౌతున్నది. మార్పు ప్రకృతి సహజమే అయినా కొందరిలో తటాలున కలుగుతుంది. మరికొందరిలో నిధానంగా కలుగుతుంది. ఒకసారి నిస్తేజం ఆవరించిందంటే వదలడం చాల కష్టసాధ్యం. కాబట్టే కవి అటువంటి

వారికోసం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించారు. చూడండి.....

**"వికసించిన చిగురులతో**
**విరబూసిన తరువులతో**
**అవతరించే మధుమాసం**
**భువికే చిరుదరహాసం"**

అంటూ లేచివురులప్పుడప్పుడే వికసించి తరువులకు కొత్త అందాన్ని తెచ్చిపెడితే, అప్పటికే చిగురేసిన కొన్ని వృక్షాలు చక్కని రంగురంగుల పూలతో రంగరంగ వైభవముగా అనంగుణ్ణి ఆహ్వానిస్తున్నాయి. ఈ విధంగా ఏర్పడిన ప్రకృతిలోని ఆహ్లాదకరమైన వాతావరణం ప్రతిజీవిని జీవింప జేస్తుంది. నిజంగా భూమి తల్లి చిరునవ్వు నవ్వుతున్నట్లే అన్పించకమానదు. అందుకేనేమో వసంతమాసారంభములోనే వచ్చే వసంతోత్సవము (కాముని పండుగ) నందు అప్పటికే విరబూసిన మొదుగపూలు కషాయముతో చేసిన కాషాయపు రంగులో "హెూలీ" జరుపుకొంటారు.

ప్రతి మనిషికి కష్టసుఖాలు తప్పరిసరి. విషాదపు చీకటిని దూరముజేసి ఆనందమును అందుకోవాలని కవికోరిక తీరుద్దాం.

**"విషాదాల నిశీథాల**
**నుసి నుసియై రాలిపోవ**
**ప్రమోదాల వినోదాలు**
**ప్రతి ఎదలో సోలిపోవ"**

అని విషాదమనే అంధకారమును మనస్సు నుండి తీసివేసి ప్రమోదమును కలిగింప జేశారు.

ఏదో జనవరి పోయి ఫిబ్రవరి వస్తుంది. ఫిబ్రవరి తర్వాత మార్చి ఇలా ఒక నెల తర్వాత మరో నెల గడిచిపోయి సంవత్సరాలు వెనక్కి వెళ్ళి పోతుంటాయి. వసంత ఋతువు మనోభావాన్ని ఇంత చక్కగా పలికించి ప్రతి ఒక్కరు సంతోషించేలా చేసిన కవి నిజంగా అభినందనీయులు.
మామిడి చిగురువేయానే అప్పటివరకు ఎక్కడకి వున్న కోకిలలు మామిడి చెట్టు మీద నివాసముండి

మామిడి చిగురువేయగానే అప్పటి వరకు ఎక్కడనో ఉన్న కోకిలలు మామిడిచెట్టు మీద నివాసముండి మామిడి చిగుళ్ళు తింటూ కుహు కుహు అంటూ భుక్తాయాసం తీర్చుకుంటాయి. పూవ్వులు, చిగుళ్ళు ఉంటే తుమ్మెదలకు, కోకిలలకు పండుగే.

**"పూచిన మామిడి పూతల**
**వీచిన మలయానిలముల**

**కమ్మని కోకల పాటల**

**బొమ్మను తేటుల ఆటల"**

అని చల్లని మలయమారుతములను మనచుట్టూ ప్రసరింపజేసి, కోకిల పాటలను, తుమ్మెద ఝుంకారములను విప్పింపజేసిన మానసికోల్లాసమును కల్గింప జేశారు.

భారతదేశము ప్రపంచంలో వున్న అన్ని మతాలకు, అన్ని భాషలకు నిలయం. ఏదేశమునకు సాధ్యపడని భిన్నత్వంలో ఏకత్వం భారతదేశపు సొత్తు. మతాలున్నా, మతాలకు కులాలున్నా, కులాలకు తెగలున్నా, ఎటువంటి అరమరికలు తెలియని ప్రజలు భారతీయులు మనమంతా భాయీ భాయీ అంటూ సమానత్వాని చాటుకుంటున్న భారతావని పుణ్యభూమి. కవి తన జన్మ భూమిని కూడ స్తుతించి ధన్యుడైనాడు. ఈ భారతదేశము ఒక పూల తోట అయితే అందలి భిన్న మతాలు, భిన్న భాషల ప్రజలు రంగురంగుల పూల మొక్కల వలె చూడముచ్చటగా వున్నారని అభిప్రాయపడ్డారు.

తెలుగు వాళ్ళకే కాదు ఎవరికైనా పండుగ వచ్చిందంటే ఎవరికైనా సంబరమే. అయితే అన్ని పండుగల వలెనే ఉగాదికి కూడ ఒక ప్రత్యేకత వున్నది. సమైక్యతా భావానికి ఉగాది సంకేతము. పవిత్ర సంస్కృతికి పూర్ణ కలశమే చిహ్నము. కోకిలలు మధురధ్వని ప్రాతఃసమయాన మానసికోల్లాసమును కలుగజేసి రోజంతా ఉల్లాసంగా, ఆనందంగా వుంచుతుంది. తొలకరి కురిసిందంటే రైతులకు చేతినిండా పని రైతులకు తీరిక లేదంటే ప్రపంచ ఆహార సమస్య తీరినట్టే.

పండుగ వచ్చిందంటే మొట్టమొదట చేసేపని ద్వారాలకు తోరణాలు కట్టడం. మామిడాకులతో తోరణాలు కట్టి శుభకార్యాలు ప్రారంభించడం మన ఆచారం. శుభకార్యమన్నప్పుడు పదిమంది రావడం పరిపాటి కాబట్టి ఆ ప్రదేశమంతా తాజాదనంతో వుండడానికి మామిడాకులు వెదజల్లే (ఆక్సిజన్) ప్రాణవాయువుతో పాటు సువాసన అవసరమవుతుంది. ఉగాది వచ్చిందంటే మొట్టమొదట గుర్తుకువచ్చేది పంచాంగ శ్రవణం. ఆ సంవత్సరమంతా దేశకాల పరిస్థితు లెట్లుంటాయి? ఏ రాశి ఫలితమెట్లుందని తెలుసుకోగోరే వారు సాయంకాలము వేళ దేవాలయ ప్రాంగణమున జేరి ఆచార్యుల వారి ద్వారా విని తెలుసుకొంటారు. ఇది శుభదాయకము కూడ.

ఉగాది పండుగ ప్రత్యేకము షడ్రుచులతో చేసే పచ్చడి. దీనిలో కలిసే ప్రతి రుచి వెనుక ఎంతో జీవిత రహస్యం దాగివున్నది. తెలుగు భాష మందలి తీపి బెల్లమయితే, ల సేవనంలోని వగరు పిందె నూమిడి, సాగరజలలోని ఉప్పు లావణ్యము, విశ్వామిత్రుని కోపం కారమైతే అది లోకోపకారమే కదా! ఔషధం చేదైతే వేపపువ్వే సరియైన మందు. మానవ మస్తిష్కంలోని చింతలే పులుపులని వేరే చెప్పనవసరం లేదు.

తీపిని గురించి చెప్పినపుడు స్వభాషను మర్చిపోకుండా స్వభావ సిద్ధమై తెలుగు యాసను, బందరు లడ్డూలను, బంగినపల్లి మామిడి పండ్లను, కృష్ణా, తుంగభద్రా, మంజీరా జీవనదుల జలాల మాధుర్యమును జ్ఞప్తికి తెచ్చుకొని అన్నింటిలోని తీయదనములను ఉగాది పచ్చడితో మేళవించి చెప్పిన కవితా పంక్తులు ఎంతో మధురంగా వున్నాయి. కవి తన మాతృభాషను, మాతృభూమిని, జన్మస్థలమును కీర్తించి, ఉగాది పచ్చడి తీయదనమును మరింత ఇనుమడింప జేశారు. ఆదికవులను కీర్తించి ఆధునిక భావాలను పంచిన కవి ప్రతిభకు ఈ క్రింది పంక్తులే తార్కాణములు.

**"నన్నయ భారతములోన**
**చిన్నయ పద విద్యలోన**
**పోతన పద్యాలలోన**
**ఊరించే మధురరసాన"**

**"బందరు లడ్డూల తీపి**
**బంగిన మామిళ్ళ తీపి**
**తెలంగాణ చెరుకు తీపి**
**కలబోసిన పలుకు తీపి"**

ఇక రెండవ రుచి వగరు. ఇది తాంబూల సేవనం చేసే ప్రతి ఒక్కరి అనుభూతి. వగరైన మామిడి చిగుళ్ళను కడుపునిండా తిని (భుక్తాయాసమో! మరి కమ్మని ఆహారం కడుపునింపిందనే ఆనందాతిశయమో) కూజితాలు పలికే కోకిల గానం పదాలు లేక అతిమధురంగాను (కొంత వగరుగాను వున్నది గదా!)

దుష్టులు, దుర్మార్గులు రాజ్య కాంక్షతో భారతదేశాన్ని చుట్టుముట్టిన శత్రువులు శివాజీ, సుభాషుల 'వగరు' రుచి చూచిన వారే. చేదు తరువాత వగరే మంచి ఔషధ లక్షణాలు కల్గిన పదార్థము. నీతినియమాలు చూపే బాటన నడవని వారికి ప్రతుకంతా ముళ్ళ బాటే అవుతుంది. జాతి విద్రోహులకు నీతి సూత్రాలు వగరు రుచినే (వెగటునే) కలుగజేస్తాయి.

**"పూరీ ఫల ఖండంతో**
**పూరించిన తాంబూలం**
**ఆరోగ్యం అందించే**
**కారణమీ వగరే"**

తాంబూలంలో ఉపయోగించే పోకచెక్క యొక్క వగరు ఆరోగ్యాన్ని కలిగిస్తుందని కవి చక్కగా చమత్కరించారు.

'ఉప్పు లేని కూర ఒప్పదు రుచులకు' అలనాడు అన్నారు మన పెద్దలు. ఉగాది పచ్చడిలో ఉపయోగించే ఉప్పు గొప్ప చరిత్రకు గుర్తు. గాంధీమహాత్ముడు అతి సామాన్యుని నుండి గొప్పవారి వరకు అందరు ఉపయోగించే ఉప్పుమీద పన్ను వేసిన ఆంగ్లేయుల పొగరు అణచుటకు సత్యాగ్రహమును చేయించిన ఘనత మరి ఉప్పుదే గదా! అంతేకాదు సాగర జలపు తళతళలకు, మానవ చర్మపు మిలమిలకు ఉప్పే కారణం. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు. కాబట్టి ఈ విషయం ఉప్పును ఉపయోగించడంలో తప్పనిసరి పాటింపదగినది. ఉప్పు అధికమైతే రక్తపోటుకు దారి తీస్తుంది. ఈ దేశపు ఉప్పు తిని జీవిస్తున్నది దేశసేవకేనని ఎన్నడూ మరువవద్దని కవి దేశప్రజలకు ఉద్భోధించారు.

**"ఉప్పు తిన్న దేశంలో**
**తిప్పలు కలిగించరాదు"**

ఉపకారం చేయని బ్రతుకులు ఉన్నా లేనట్టేనని, ఉప్పు ఊరగాయ కెంతటి రుచినిస్తుందో, అదేవిధంగా దేశప్రజలు అందరూ కలిసి వుంటే ఐక్యత సాధ్యమవుతుందని, దేశము అభివృద్ధి పధాన పయనిస్తుందని అభ్యుదయము నాశించి చెప్పిన క్రింది మాటలు చూడండి.

**"ఉప్పు లేని వంటకాలు**
**చప్పబడే తీరే**
**ఉపకారం లేని బ్రతుకు**
**ఉన్నా బేజారే**
**ఉప్పు కలిసి ఊరగాయ**
**ఊరించే విధమే**
**జనులందరి, కలయికలో**
**కనబడు నురు పథమే"**

విశ్వామిత్రుని కోపం త్రిశంకునకు స్వర్గాన్ని ప్రసాదించింది. హరిశ్చంద్రుని సత్య సంధతను లోకానికి చాటింది. మంచిదే కదా! ఆ విధంగా లోక హితమును కోరునంతవరకు కారము, మమకారము మంచివి. అంతకు మించితే అది అపకారమే అవుతుంది. ఒకరి మీద ఒకరు కారాలు మిరియాలు నూరే స్వభావం మర్చిపోయి ఒకరికొకరు మమకారం పంచుకోవాలి. దుష్టత్వముపై పోరాడి

శిష్టత్వమును ఎల్లకాలము నిలపాలి.

**"విశ్వామిత్రుని చూర్ణం**

**......................**

**......................**

**విజయభావ సంపూర్ణం"**

ఔషధ ప్రపంచమంతా చేదుమయం. మనిషిని మనిషి దోచుకొనే స్వభావం లేదు. జీవితంలో చేదు తీపిలు వెలుగు నీడల వంటివి. చేదును అధిగమించిన వారే. జీవితమున ముందు సాగగలరు. ఒక దేశ ప్రజలందరు సోదరుల వంటివారు. వారు తరతమ భేదం మరచిననాడే మానవ జన్మ సార్థకమవుతుంది. ఆరోగ్యాన్ని కలిగించేది చేదు. జీవన మార్గాన్ని సూచించేది లేదు. మానవజాతికి మంచిని కలిగించే చేదు, మనుష్యుల మనస్సులలో వుంటే ఆ చేదు మనిషి పతనానికి దారి తీస్తుంది.

**"సోదరులు మన మధ్యన**

**భేదం చూపితే చేదు**

**భిన్న భిన్న జనుల నదుమ**

**భిన్నత్వం కటిక చేదు"**

పులుపు చింతలను తలపింప జేస్తుంది. జీవితంలో చింతలు, వంతలు సాధారణమైనవనుటకు ఉగాది పచ్చడిలోని రుచుల పరమోద్దేశ్యము. మనిషి వుండే వ్యధ కన్నా మనసులో వుండే దురాలోచన అతి భయంకరమైనది. దానిని గెలిచినవాడే అసలైన మనిషి మనసు చెప్పినట్లుగాకుండా వివేకం చెప్పినట్లు నడుచుకుంటే మనిషి జ్ఞాని అవుతాడు.

**"మామిడిలో పులుపున్నది**

**మనసు పొరల గెలుపున్నది**

**పులుపు తీపి పిలుపువినీ**

**గెలుపు కనీ పదముందుకు"**

ఉగాది పండుగనాడు చేసే పచ్చడిలోని షడ్రుచుల సమ్మేళనాన్ని భారత ప్రజలలోని సమైక్యతా భావాన్ని తెలియజేసే ఈ క్రింది పంక్తులు పరిశీలించండి.

**"ఆరు రుచుల వలె జాతులు**

**వేరు వేరు ఉన్ననేమి?**

**అన్నీ మనకభిమతమే**

**వెన్నెలలా సురుచిరమే!**

**భాషలు ప్రాంతాలెన్నో**
**దేశంలో కనబడినా**
**అంతరంగ మొకటే – మన**
**స్వాంతరంగమొకటే”**

స్నేహ సంకేతాలతో కూడిన మన సౌభ్రాతృత్వము ప్రపంచానికి ఆదర్శమై నిలుచును. ఈ ఆరు రుచులు పచ్చడిగా మారి సమైక్య భారతావనికి తార్కాణముగా నిలుచును. రుచులు ఆరైనా మరెన్నైనా అని నేటికవే ప్రసిద్ధము, ప్రత్యేకము.

ఈ విధంగా ఆరురుచులతో వచ్చిన ఆమని, తెలుగువారి మనస్సునకు అమృత స్పర్శనందించి సేద తీర్చును. భాష ఏదైనా, ప్రాంతమేదైనా భావాలు మంచిదైతే మేలు.

ఈ భావాలు కవి జిహ్వకు అందినవి మాత్రమేగాదు. మనస్సును హత్తుకొనే భావాలు మనస్సు నుండే కదా పలికేవి? కవియొక్క మానసిక భావ పొందికను సమైక్యతా నీటిని కలిగివున్న ఈ “ఆరు రుచుల ఆమని” అనే ఈ చిన్ని పుస్తకము గొప్పనైనది. పరిమాణము స్వల్పమైనా, అనల్పమైన ప్రమాణము గలదు.

## ఆధార గ్రంథాలు:

డా॥ అయాచితం నటేశ్వర శర్మ గ్రంథ సంపుటి
జాతీయ సాహిత్య పరిషత్తు, కామారెడ్డి, 1995